క్లుప్తంగా

పక్కాగా డ్రైడే

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 31 వార్డుల్లోనూ వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే శుక్రవారం పక్కాగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనవసర నీటి నిల్వలను పారబోయించారు. నీరు ఎక్కువగా నిల్వ ఉంటే దోమలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని, వాటి ద్వారా మలేరియా, డెంగీ వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది, పెంట గ్రామాల్లో డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పిరిడి పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, నీటి నిల్వలను పారబోయించారు. అనవసరంగా నీరు నిల్వ చేస్తే వచ్చే అనర్థాలను వివరించారు. ఆరోగ్య సూచనలు చేసి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన

రాజాం సిటీ: మండల వ్యాప్తంగా ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు ఘనవ్యర్థాల నిర్వహణపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వర్మీకంపోస్టు ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు. చెత్త సేకరణ, పొడిచెత్త, తడిచెత్తను వేరుచేయడం, వర్మీకంపోస్టు తయారీ, మార్కెటింగ్ చేయడం వంటి అంశాలను వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా క్లాప్ మిత్రలకు వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని సోపేరు కంపోస్టు యూనిట్‌ను సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు.

రేగిడి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణలో రెండోరోజు అయిన శుక్రవారం పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ నిధులు కేటాయిస్తేనే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమని పలువురు సర్పంచ్‌లు అధికారులను కోరారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య


సత్యధర్ (ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధి ఇల్లంనాయుడువలస గ్రామానికి చెందిన ఘంటసాల సత్యధర్ (22) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఏఎస్సై జనార్దనరావు తెలిపారు. ఈ ఘటనపై ఏఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యధర్ భార్య సుజాత 9 నెలల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె ఎక్కడ ఉన్నదీ తెలియకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 7న తోటపల్లి కాలువ గట్టుపై వివరాలు తెలుపుతూ సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు మృతుని తల్లి ఘంటసాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశామని ఏఎస్సై శుక్రవారం తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని మెంతిపేట ఎస్సీ కాలనీ, గాయత్రి కాలనీ, సారధి రోడ్డు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు శుక్రవారం పర్యటించి, అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తాచెదారం కాలువల్లో వేయొద్దని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జె.త్రినాధరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల హోమ్‌వర్క్, చేతిరాత పుస్తకాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను చూసి, సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

'క్విట్ కార్పొరేట్'

బొబ్బిలి: సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక పట్టణంలో రైతుకూలీ సంఘం, పట్టణ కలాసీ సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయం, పారిశ్రామిక, వ్యాపార రంగాల్లోకి కార్పొరేట్ శక్తులు చొరబడడాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో ఇదేరోజున చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం మాదిరి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయా సంఘాల కార్యదర్శి దంతులూరి వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కేంద్రంలోని అధికారంలోని బీజేపీ ప్రభుత్వం తన పదేళ్ల పాలనా కాలంలో కార్పొరేట్‌లకు చెందిన రూ.14.56 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని, కానీ రైతు రుణమాఫీ మాత్రం చేయడం లేదన్నారు. ఇది కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం కొమ్ముకాయడం కాదా అని ప్రశ్నించారు. డబ్ల్యూటీవో(వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాల్లోకి కార్పొరేట్‌ల చొరబాటును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సూరిబాబు, రాజు, అప్పలస్వామి, అప్పారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ల ప్రోద్బలంతోనే దాడులు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


బొబ్బిలి: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు, మంత్రి నారా లోకేశ్‌ల ప్రోద్బలంతోనే టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు ఎగబడుతున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండిపడ్డారు. ఇటీవల విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు టీడీపీ శ్రేణులు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన శుక్రవారం పాలాభిషేకం చేశారు. జోహార్ అంబేడ్కర్, జై భీమ్ అని నినాదాలు చేసి, గౌరవభావం చాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ పరిపాలనకు ఆధారమైన అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ వంటి మహనీయుడిని ఈ విధంగా టీడీపీ మూకలు అవమానించడం చాలా బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆ మహా కట్టడం దేశంలోనే మంచి కట్టడంగా పేరొందిందని, మహోన్నతుల విగ్రహాలను కూడా నాశనం చేసే కుట్రకు టీడీపీ తెర తీసిందంటే ఎంతకు దిగజారారో అర్థం చేసుకోవచ్చన్నారు. విగ్రహాలు, విగ్రహాల వద్ద ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించినంత మాత్రాన ప్రజల మనసులలో నుంచి జగన్‌ను తీసేయలేరన్నారు. ఆదివాసీ దినోత్సవానికి ముందురోజునే అలాంటి ఘటన జరగడం విచారకరమన్నారు. కూటమి నాయకులు చేస్తున్న దుర్మార్గాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎప్పటికైనా ప్రజల చేతుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని పాడుచేయడానికి ప్రయత్నించడమనేది రాజ్యాంగాన్ని అవమానపరచడమేనన్నారు. సమానత్వమనే భావనను తుంచడమేనన్నారు. అది కేవలం విగ్రహం కాదని కోటానుకోట్ల భారతీయుల ఆత్మగౌరవమని, ఈ పద్ధతి సరికాదన్నారు. ఆ ఘటనలోని నిందితులను తక్షణమే పట్టుకుని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, చోడిగంజి రాజగోపాలనాయుడు, ఎస్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన గాడి తప్పింది..


రాజాం సిటీ: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి టీడీపీ శ్రేణులు యత్నించిన ఘటనను వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. అంతకుముందు స్థానిక పాలకొండ రోడ్డు జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, జై భీమ్ అని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అయిన అంబేడ్కర్ స్మృతికి చిహ్నంగా నిర్మించిన విగ్రహాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. టీడీపీ మూకలు చేసిన ఈ దుశ్చర్యతో యావత్ భారత దేశం నివ్వెరపోయిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్ మహాశిల్పాన్ని కూలగొట్టే చర్యకు టీడీపీ పూనుకోవడం అత్యంత హేయమైన చర్యన్నారు. అరాచక పాలనకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఇటువంటి ఘటనలతో పాటు మరెన్నో చోట్ల దాడులు, అఘాయిత్యాలు, జరుగుతున్నా అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక.. ప్రజలను పక్కదోవ పట్టించేందుకే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై హత్యలు, దాడులు, ఆస్తుల ధ్వంసం వంటివి చూస్తుంటే ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు. వీటన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలకకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, నాయకులు వాకముళ్ల చిన్నంనాయుడు, యాలాల వెంకటేష్, దూబ గోపాలం, ఆశపు సూర్యం, శాసపు వేణుగోపాలనాయుడు, కెంబూరు నారాయణరావు, పాలవలస గోపి, వంజరాపు విజయ్‌కుమార్, గార సత్యనారాయణ, త్రినాద్, గోకవలస బాబూరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో హెచ్‌ఎం ఓవరాక్షన్

- కోరం ఉన్నప్పటికీ లేదనే సాకుతో ఎన్నిక వాయిదా
- ప్రధానోపాధ్యాయుడి తీరుపై గ్రామస్తుల మండిపాటు


వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎస్‌ఎంసీ డైరెక్టర్లు

రాజాం: మండలంలోని ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ఆ పాఠశాల హెచ్‌ఎం సూర్యం చేసిన ఓవరాక్షన్‌పై గ్రామస్తులు మండిపడుతున్నారు. కోరం ఉన్నప్పటికీ చైర్మన్ ఎన్నిక వాయిదా వేయడంపై డైరెక్టర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీనే ఎస్‌ఎంసీ ఎన్నిక పూర్తి చేయాల్సి ఉన్నా హెచ్‌ఎం మాత్రం అర్థాంతరంగా ఎన్నికను వాయిదా వేశారు. తొలుత డైరెక్టర్ల ఎన్నిక నిర్వహించగా, పాఠశాలలోని 1 నుంచి 6 తరగతులకు సంబంధించి 18 మంది డైరెక్టర్లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలిచారు. 7, 8 తరగతుల్లో డైరెక్టర్ల ఎన్నిక నిర్వహించలేదు. మొత్తం 24 మంది డైరెక్టర్లకు గాను 18 మంది ఎన్నిక జరిగి, కోరం ఉన్నప్పటికీ కోరం లేదనే షాకు చెప్పి, ఎన్నికను వాయిదా వేశారు. ఈ విషయంపై డైరెక్టర్లు గట్టిగా పట్టుపట్టడంతో ఎన్నిక నిర్వహిస్తామని చెప్పి, సాయంత్రం వరకు ఎన్నిక నిర్వహించకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో సర్పంచ్ కోనారి అనూష, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు హెచ్‌ఎం తీరును తప్పుబట్టారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అప్పారావు తెలిపారు. సదరు హెచ్‌ఎం తీరుకు వ్యతిరేకంగా ఆ పాఠశాల వద్ద ఎస్‌ఎంసీ డైరెక్టర్లు శుక్రవారం కాసేపు నిరసన చేపట్టి, నైతికంగా తామే గెలిచామని ప్రకటిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని, కొత్తగా ఎన్నికైన 18 మంది డైరెక్టర్లంతా జై వైఎస్సార్ సీపీ అని నినాదాలు చేశారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట

బొబ్బిలి రూరల్: సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేయవచ్చని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి వరిపంట పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు. తొలుత వరినాట్లు శుద్ధి చేసుకోవాలని, ఆ తర్వాత వరినారు చివర్లు తుంచి వరుస పద్ధతిలో నాటుకోవాలన్నారు. అలాగే రసాయనిక ఎరువులు బదులుగా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడితే నేలసారం పెరగడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం జీవామృతం తయారీ, వాటి ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు.

ఫీవర్ సర్వే చేయండి

రేగిడి: ఫీవర్ సర్వే చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లోని ఏ ఒక్కరూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు బారినపడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూనే పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎవరైనా ఎక్కడైనా జ్వర లక్షణాలతో బాధపడినట్లు గుర్తిస్తే వారు వెంటనే ఆస్పత్రికి వెళ్లి, చికిత్స పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుందరేశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆటల పోటీలు సందడి

బొబ్బిలి: ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని, పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆటల పోటీల సందడి మొదలైంది. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థుల మధ్య కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో బహుమతులు అందజేస్తామని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం పంచి గెలిచారనడం సరికాదు

మెంటాడ: మద్యం పంపిణీ చేసి గెలిచామని తమపై ఆరోపణలు చేయడం సరికాదని ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) చైర్మన్ ఎద్దునగల అప్పన్న, వైస్ చైర్‌పర్సన్ రాయి సుమిత్ర అన్నారు. మండలంలోని పెదచామలాపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో వారు చైర్మన్, చైర్‌పర్సన్‌లుగా ఎన్నికకాగా, వారు ఓటర్లకు మద్యం ఇచ్చి గెలిచినట్లు పలు వార్తా పత్రికలు, న్యూస్ చానల్‌లో దుష్ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారు శుక్రవారం స్పందించి, ఖండించారు. ఎన్నిక జరిగిన రోజున తమ గ్రామంలో జరిగిన పెళ్లి వారింట్లో పోలీసులు మద్యంసీసాలు పట్టుకుంటే వాటిని తాము పంచేందుకు తెచ్చినట్లు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ కుట్ర పూరిత ప్రచారమన్నారు.

అధ్వానంగా సతివాడ-నెమలాం రోడ్డు

- పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు


బురదమయమైన రోడ్డులో సైకిలు నడిపించుకుని నెమలాం హైస్కూల్‌కి వెళ్తున్న విద్యార్థి


సతివాడ-నెమలాం రోడ్డులో ఒకరి తర్వాత ఒకరు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

తెర్లాం: మండలంలోని సతివాడ-నెమలాం రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఆ రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్న వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సతివాడ గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎక్కడికక్కడ పెద్ద గుంతలు ఉండడంతో పాటు మట్టిరోడ్డు కావడంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయమై, ఏ గొయ్యి ఎక్కడుందో అర్థం కాని దుస్థితి. దీంతో విద్యార్థుల సైకిళ్లు ముందుకు కదలలేని పరిస్థితి. పోనీ కాలినడకన వెళదామంటే ఏ గొయ్యి ఎక్కడుందో తెలీదు. కొంచెం కాలు జారినా ఆ బురదలో పడి ఏదో ఒకటి విరగొట్టికోవాల్సిందే. ఇంటిబాట పట్టాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొత్త రోడ్డు వేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

న్యాయ అవగాహన సదస్సు


రాజాం సిటీ: వితంతువులందరికీ పింఛన్ సక్రమంగా అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పింఛన్ రాని వితంతువులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులంతా చిత్తశుద్ధి, నిబద్ధతతో పని చేసి అర్హులైన వారందరికీ పింఛన్లు అందజేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు సక్రమంగా చేరవేయడమే అన్ని వ్యవస్థల ప్రధాన ధ్యేయమన్న విషయం మర్చిపోవద్దన్నారు. అలాగే యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీటీ కృష్ణసాయితేజ, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మయ్యపేటలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభావతి జాగృతి ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరంతో పాటు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు చేస్తున్న సేవలను రెడ్‌క్రాస్ రాజాం శాఖ అధ్యక్షులు ప్రశంసించారు. 40 కుటుంబాలు ఉన్న గ్రామాన్ని దత్తత తీసుకుని సంక్షేమ పథకాలు, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్ల వినియోగం వంటి మౌలిక వసతులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం చాలా గొప్ప విషయమన్నారు. సొంత నిధులతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు సమకూర్చి, వారి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.

టీకాలే పశువులకు శ్రీరామరక్ష

- పశువైద్య శాఖ ఏడీ ఎల్.విష్ణు


గొంతువాపు వ్యాధి సోకిన పాడిఆవును పరిశీలిస్తున్న పశువైద్య శాఖ ఏడీ విష్ణు

రామభద్రపురం: పశువులకు టీకాలే శ్రీరామరక్ష అని పశువైద్య శాఖ ఏడీ ఎల్.విష్ణు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న లంపీ స్కిన్(పశువులకు సోకే ముద్దచర్మ వ్యాధి) వ్యాక్సినేషన్, గొంతువాపు వ్యాధి లక్షణాల గుర్తింపును ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా వ్యాధుల లక్షణాలను గుర్తించి, సరైన చికిత్సను సకాలంలో అందిస్తే పశువులను కాపాడవచ్చన్నారు. గొంతువాపు వ్యాధి సోకిన పశువులు ఎక్కువ శాతం మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యాధి సోకిన పశువులకు అత్యధిక శరీర ఉష్ణోగ్రత వల్ల కంటి నుంచి నీరు కారడం, ఎర్రబడి పోవడం, నోటి నుంచి చొంగ కారడం, గొంతు, మెడపై వాపు రావడం, శ్వాస కష్టంగా మారడం వంటివి జరుగుతాయన్నారు. దీనికి ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. పశువులకు అవసరమైన టీకాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సీజన్‌లోనే పశువులకు లంపీస్కిన్, గొంతువాపు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్యంగా ఉన్న పశువులకు ముందస్తుగానే లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో కొట్టక్కి పశువైద్యాధికారి ఎ.స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ప్రజాసమస్యలు పరిష్కరించాలి


వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: తక్షణమే ప్రజాసమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌వోలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్తున్నారని, వీలైనంత వరకు మండల పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలు, లేఅవుట్ల పరిస్థితులపై చర్చించారు. గ్రామాల్లోని భూ తగాదాలు, మౌలిక సదుపాయాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని, వీఆర్‌వోలపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్‌ఐ కళ్యాణచక్రవర్తి, సీఎస్‌డీటీ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు సూచనలిస్తున్న సంకిలి సుగర్ ఫ్యాక్టరీ డీజీఎం కేన్ రమేష్

రేగిడి: చెరకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం డీజీఎం కేన్ రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని కేన్ డివిజన్ ప్రాంతీయ కార్యాలయంలో డివిజన్-1 పరిధిలోని చెరకు సాగు రైతులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెరకు పంట దిగుబడి పెంచేందుకు ఐదు సూత్రాలు పాటించాలని తెలిపారు. కలుపు నివారణ, సకాలంలో ఎరువుల వినియోగం, దూరపుసాళ్ల పద్ధతి, విత్తన ఎంపిక, సూక్ష్మపోషకాల వినియోగం వంటివి అనుసరిస్తే దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. అనంతరం చెరకు పంటలో కొత్త వంగడాలు గురించి ఆర్‌అండ్‌డీ హెడ్ డాక్టర్ షణ్ముఖసుందరం, మేనేజర్ రామచంద్రన్ వివరించారు. సమావేశంలో కేన్ మేనేజర్ కమల పట్నాయక్, డివిజన్ ఇన్‌చార్జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సుగర్ కేన్ సొసైటీ ఎన్నికలు..

బొబ్బిలి: మండల కేంద్రంలో ది బొబ్బిలి సుగర్ కేన్ గ్రోయర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం జరిగాయని నిర్వాహకులు తెలిపారు. చైర్మన్‌గా సబ్బిన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా బేతనపల్లి సత్యం, కార్యదర్శిగా యాళ్ల శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని కార్పొరేట్‌కు అప్పగిస్తే సహించం

- ఏపీ రైతు సంఘం నాయకుడు ఎస్.గోపాల్


కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

తెర్లాం: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తే సహించేది లేదని ఏపీ రైతు సంఘం బొబ్బిలి నియోజకవర్గ నాయకుడు ఎస్.గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ రంగం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వ్యతిరేకించారు. ఎన్నికలకు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవసాయ రంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని, రైతు ఆత్మహత్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేలా చర్యలు చేపట్టడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇప్పటికైనా రైతులకు మేలు చేకూర్చేలా వ్యవసాయ చట్టాలు రూపొందించాలని, వ్యవసాయ రంగానికి సంబంధించిన వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతు మేధస్సు పెంచేందుకే 'పొలంబడి'


కార్యక్రమంలో పాల్గొన్న ఏవో కన్నబాబు, రైతులు

వంగర: పంటల సాగులో రైతుల మేధస్సును పెంచేందుకే పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని తలగాం గ్రామంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరినాట్లు వేసే ముందు వరినారు కింది భాగాన్ని సూడోమనాస్ ద్రావణంలో ముంచిన తర్వాత నారు చివర్లు తొలగించి నాటుకోవాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా వరిపంటకు సోకే అగ్గితెగులు, పొడతెగులు, ఆకుఎండు తెగులును నివారించవచ్చన్నారు. వరిపంటకు ఆయా తెగుళ్లు సోకితే లీటరు నీటిలో 10 గ్రాముల సూడోమోనాస్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అన్ని సచివాలయాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి

వంగర: ఓపెన్ స్కూల్ ద్వారా అందిస్తున్న దూరవిద్యను చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో కేవీ రమణయ్య కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌ల పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, అభ్యర్థులు త్వరపడాలన్నారు. ఓపెన్ సొసైటీ కో-ఆర్డినేటర్‌గా పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎస్.జయకృష్ణ ఎంపిక కావడాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో వై.దుర్గారావు, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

రేగిడి: మండలంలోని చాటాయివలస, అంబఖండి గ్రామాల్లోని రైతులకు శుక్రవారం ఎరువులు పంపిణీ చేశారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను పూర్తిస్థాయిలో సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా వంటి ఎరువులు కొనుగోలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో విజయలక్ష్మి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.